నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 9 జూన్ 2024 | HYDERABAD



వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డేను పురస్కరించుకొని గచ్చిబౌలి కేర్ వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం అవగాహన వాకథాన్ నిర్వహించారు. బ్రెయిన్ ట్యూమర్ బారినపడి విజయవంతంగా చికిత్స పొందిన వారితో ఈ అవగాహన వాకథాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రముఖ ఐఏఎస్ రజత్ కుమార్, డాక్టర్ రూప కొడువాయర్, ఆప్టీమస్ గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పీఏంఎక్స్ సహ వ్యవస్థాపకులు డాక్టర్ సమతా తుల్లాలు ముఖ్య అతిథులుగా హాజరై వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు.

-శేరిలింగంపల్లి జూన్ 8

## 15 నెలల చిన్నారిపై..
# వీధి కుక్కల దాడి



దుండిగల్, జూన్ 8: ఇంటిముందు ఆడుకుంటున్న 15 నెలల చిన్నారిపై వీధికుక్కలు దాడిచేసి గాయపరిచాయి.ఈ ఘటన డీ.పోచంపల్లి పరిధిలో శనివారం సాయంత్రం జరిగింది. బీహార్‌కు చెందిన మింటూసింగ్, నీమాదేవి దంపతులు డీ. పోచంపల్లి సత్య సాయి కాలనీలో నివాసముంటున్నారు . వీరి మూడో కుమార్తె ఆరుషి శనివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా అటుగా వచ్చిన రెండు వీధికుక్కలు దాడిచేసి గాయపరిచాయి. అరుపులు విన్న కుటుంబసభ్యులు.. కుక్కలను చెదరగొట్టి చిన్నారిని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. మరో ఘటనలో నిజాంపేట జర్నలిస్టు కాలనీలో సాయిచరణ్ (14) అనే బాలుడిపై వీధి కుక్కలు దాడిచేయడంతో గాయాలయ్యాయి.



శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం కోసం కొర్రమీన్లతో కూలైన్లలో నిల్చున్న జనం

# చేప ప్రసాదానికి వెల్లువలా..

## భారీగా తరలివచ్చిన ఆస్తమా వ్యాధిగ్రస్తులు.. కిక్కిరిసిన నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం

సిటీబ్యూరో/ అబిడ్స్, సుల్తాన్‌బజార్, జూన్ 8: మృగశిర కార్తెను పురస్కరించుకొని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బత్తిని కుటుంబం అందించే చేప ప్రసాదం కోసం శనివారం జనం పోటెత్తారు. నగరం నలుమూలల నుంచే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఆస్తమావ్యాధిగ్రస్తులు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జీహెచ్ఎంసీ, జలమండలి, ఆర్అండ్‌బీ, విద్యుత్, రెవెన్యూ, మత్స్య, అగ్నిమాపక, పోలీస్ శాఖలు, ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 32 కౌంటర్ల ద్వారా చేప ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఇదిలా ఉంటే పలు స్వచ్ఛంద సంస్థలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఫలహారాలు అందించి మానవత్వాన్ని చాటుకున్నాయి.

### 60 వేల వరకు టోకెన్ల విక్రయం

ఉదయం తొమ్మిదిన్నర గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మేయర్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మత్స్య పారిశ్రామిక సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌లతో కలిసి చేప ప్రసాదం పంపిణీని ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మేయర్ విజయలక్ష్మి చేప ప్రసాదాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ గోపి, హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కేశవ్ పాటిల్, మత్స్య శాఖ అదనపు డైరెక్టర్ శంకర్ రాథోడ్, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఢిల్లీ, హర్యానా, ఛత్తీస్‌గఢ్, యూపీ, బీహార్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి చేప ప్రసాదం కోసం జనం తరలివచ్చారు. రాత్రి వరకు దాదాపు అరవై వేల వరకు టోకెన్ల విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు నగరంలోని వివిధ మార్గాల నుంచి ఎగ్జిబిషన్ మైదానానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. అలాగే నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. రెండు రోజుల పాటు చేప ప్రసాదం పంపిణీ ఉండటంతో ఎగ్జిబిషన్ మైదానం.. పరిసరాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ముఖ్యంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా షీటీమ్స్‌ను రంగంలోకి దించారు.

### క్యూలో నిల్చొని..కుప్పకూలి..

చేప ప్రసాదం పంపిణీలో అపశృతి చోటుచేసుకున్నది. చేప ప్రసాదం కోసం వచ్చిన నిజామాబాద్ జిల్లాకు చెందిన గొల్ల రాజన్న(60) గుండెపోటుతో చనిపోయారు. అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్ల రాజన్న చేప ప్రసాదంకోసం శుక్రవారం సాయంత్రం మనవడితో కలిసి నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానానికి వచ్చారు. శనివారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో చేప మందు ప్రసాదాన్ని స్వీకరించేందుకు క్యూలైన్‌లో నిలబడ్డారు. క్యూలైన్‌లలో ప్రజలు ఎక్కువగా ఉండటం, తీవ్ర అనారోగ్యంతో ఉన్న రాజన్నకు ఒక్కసారిగా గుండెపోటు వచ్చి పడిపోయారు. గమనించిన స్థానిక పోలీసులు సీపీఆర్ చేసి.. కేర్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ రాజన్న మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

### చేప ప్రసాదం పంపిణీని ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్

### క్యూలో నిల్చొని..గుండెపోటుతో నిజామాబాద్ వాసి మృతి



### 150 ఏండ్లుగా చేప ప్రసాదం పంపిణీ

-మంత్రి పొన్నం ప్రభాకర్

మృగశిర కార్తె సందర్భంగా బత్తిని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చేప మందు పంపిణీ 150 ఏండ్లుగా కొనసాగుతున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చేప ప్రసాదం పంపిణీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా ప్రజలు ఎంతో విశ్వాసంతో చేప మందును స్వీకరిస్తున్నారన్నారు. వివిధ దేశాలు, దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు చేప ప్రసాదం కోసం వస్తున్నట్లు చెప్పారు.

### 1998 నుంచి ప్రసాదం స్వీకరిస్తున్నా

ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్

ఆస్తమా వ్యాధి బాధపడుతున్న తాను 1998 నుంచి బత్తిని సోదరులు అందించే చేప ప్రసాదాన్ని స్వీకరిస్తున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ గౌడ్ పేర్కొన్నారు. చేప మందు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. తనకు ఆస్తమా ఉండేదని ఈ చేప ప్రసాదం తీసుకున్న అనంతరం చాలా వరకు తగ్గిందని చెప్పారు.



చేప మందు వేసుకుంటున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్

## సీఎం క్యాంప్ ఆఫీస్‌గా
# ‘హెచ్‌జీసీఎల్’

### రూ.1.10 కోట్లతో కార్యాలయంలో ఆధునీకరణ పనులు

### టెండర్లు పిలిచిన హెచ్‌ఎండీఏ

సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ): నానక్‌రాంగూడ ఔటర్ రింగు రోడ్డు ఇంటర్‌చేంజ్‌లో ఉన్న హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) కార్యాలయం సీఎం క్యాంప్ ఆఫీస్‌గా మారనున్నది. ఇప్పటికే అనేక సార్లు సీఎం రేవంత్ రెడ్డి హెచ్‌జీసీఎల్ కార్యాలయం నుంచి ఎంఏయూడీ పరిధిలోని పలు శాఖలతో ఉన్నతాధికారులు, ఆయా శాఖలు చేపట్టే ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా పురపాలక శాఖకు సంబంధించిన కార్యకలాపాలకు ఇది ఎంతో అనువుగా ఉండటంతో ఇక్కడి నుంచే ఆ శాఖ పరిధిలోని జీహెచ్ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్‌బోర్డు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ (ఎంఆర్‌డీసీఎల్) వంటి శాఖల ఉన్నతాధికారులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నానక్‌రాంగూడ హెచ్‌జీసీఎల్ భవనాల వద్ద భద్రత పరంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ముఖ్యమంత్రి వద్దే పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కూడా ఉండటంతో ఇక్కడే ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీఎం కూర్చునేందుకు ప్రత్యేకంగా చాంబర్‌తో పాటు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించేందుకు సెమినార్ హాళ్లను సిద్ధం చేస్తున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా భవనం చుట్టూ మార్పులు చేస్తున్నారు.

### రూ.1.10 కోట్లతో ఆధునీకరణ..

సీఎం క్యాంప్ ఆఫీస్‌కు అనువుగా ఉంటుందనే ఆలోచనతోనే హెచ్‌ఎండీఏ పరిధిలోని హెచ్‌జీసీఎల్ కార్యాలయాన్ని ఎంచుకున్నారు. ఇప్పటికే అనేక సార్లు సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడి నుంచే పురపాలక శాఖ పరిధిలోనే విభాగాలతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే సీఎం కార్యాలయానికి అనువుగా ఉంటుందని ఇక్కడ ప్రత్యేక భద్రత ప్రమాణాలతో పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం మొత్తం రూ.1.10 కోట్లతో పనులు చేపట్టేందుకు శుక్రవారం హెచ్‌ఎండీఏ అధికారులు టెండర్లు పిలిచారు. ఇందులో భాగంగా సుమారు రూ. 60 లక్షల వ్యయంతో రెండు భవనాల చుట్టూ రక్షణ కవచంగా వ్యూ కట్టర్స్‌ను, సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అదే విధంగా త్రిభుజాకారంలో ఉన్న ఈ భవనాల చుట్టూ రోడ్లే ఉన్నాయి. దీంతో ఈ చర్యలు చేపట్టినట్లు ఓ అధికారి తెలిపారు. ఈ పనులకు తోడు మరో రూ. 50.02 లక్షలతో అగ్ని ప్రమాదాల నివారణ, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. భద్రతపరంగా ఎలాంటి లోపాలు లేకుండా చేయనున్నారు. ఇప్పటికే ఈ భవనంలో ఉన్న టీఎస్ బీపాస్ కార్యాలయాన్ని మాసాబ్ ట్యాంక్‌కు తరలించారు. ఔటర్ రింగు రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించిన కార్యాలయాన్ని పక్కనే ఉన్న మరో భవనంలోకి మార్చారు. ప్రస్తుతం ఈ భవనంలో సీఎం క్యాంపు కార్యాలయంతో పాటు మూసీ రివర్ ఫ్రంట్‌కు సంబంధించిన కార్యాలయం, ఫార్మాసిటీ కోసం గత కేసీఆర్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కార్యాలయం ఉంది. ఈ రెండు భవనాల్లో సీఎం వచ్చిన సమయంలో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయని గుర్తించి, మరో చోట పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు.



నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ వద్ద ఉన్న హెచ్‌జీసీఎల్ కార్యాలయం



వర్షం కారణంగా శనివారం బేగంపేట మెట్రోస్టేషన్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

## రాగల మరో మూడు రోజులు..

సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ): రుతుపవనాల ప్రభావంతో రెండు మూడు రోజులుగా కురుస్తున్న వానలతో గ్రేటర్ వాతావరణం చల్లబడింది. శనివారం మధ్యాహ్నం నగరంలోని మెహిదీపట్నం, హిమాయత్‌నగర్, విద్యానగర్, అడిక్‌మెట్, తార్నాక, మౌలాలి తదితర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. రుతుపవనాలు మరింత విస్తరిస్తుండటంతో రాగల మరో మూడు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. శనివారం గరిష్ఠం 33.0, కనిష్ఠం 23.9 డిగ్రీలు, గాలిలో తేమ 92 శాతంగా నమోదైనట్లు వెల్లడించారు.

# తుమార్ చెరువు ఆక్రమణల కూల్చివేత

## కలెక్టర్ ఆదేశాలతో కదలిన యంత్రాంగం

కుత్బుల్లాపూర్, జూన్ 8: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దూలపల్లి తుమార్‌చెరువు అలుగు ఆక్రమణలను కలెక్టర్ ఆదేశాలతో శనివారం ఇరిగేషన్, రెవెన్యూ, కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. సర్వే నంబర్ 2,3,4లో తుమార్ చెరువు నిండితే అలుగు పారేందుకు అనువుగా ఉండేది. దీంతో అక్కడి పట్టాదారులు భూముల అభివృద్ధి కోసం అమ్మకాలు చేపట్టిన తర్వాత బిల్డర్లు నిబంధనలకు విరుద్ధంగా స్థలాల చుట్టూ గోడలను కాంక్రీట్ నిర్మాణంతో చేపట్టారు. దీంతో భవిష్యత్‌లో చెరువు అలుగులు పారితే దూలపల్లి గ్రామం పూర్తిగా నిండిపోయే ప్రమాదం పొంచి ఉన్నదని, దీనికి తోడు చెరువు ఆయకట్టు కింద నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న పెద్దపెద్ద బహుళ అంతస్తుల నిర్మాణాలకు సైతం ప్రమాదాలు తప్పవని గ్రహించిన గ్రామస్తులు..ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు తెలిపారు. దీంతో ఆయన జిల్లా కలెక్టర్ గౌతమ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్.. దుండిగల్–గండిమైసమ్మ తహసీల్దార్ మతిన్‌కు ఆదేశాలు జారీ చేయడంతో ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ కె. శ్రీహరి, టీపీఓ రాజారెడ్డితో పాటు సిబ్బంది రంగంలోకి దిగి ఆక్రమణలను నేలమట్టం చేశారు. ఇదిలా ఉంటే మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కూల్చివేతల ప్రాంతాన్ని అనుచరులు, గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. అధికారులు త్వరితగతిన చెరువు అలుగులు పారేందుకు నక్షా ప్రకారం మార్కింగ్‌లు వేసి ఇవ్వాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కావాల్సిన అభివృద్ధి పనులను మంజూరు చేయించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని మైనంపల్లి హన్మంతరావు అన్నారు. తుమార్ చెరువు పైభాగం పూర్తిగా మట్టిపోసి.. వ్యాపార సముదాయాలు వెలిశాయని, అధికారులు సంయుక్తంగా పరిశీలన చేపట్టి చెరువులో వెలసిన అక్రమ నిర్మాణాలు కూల్చివేయడంతో పాటు ఇక్కడ అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను నిలిపివేయాలని మేడ్చల్ రెవెన్యూ అధికారులతో పాటు గుండ్లపోచంపల్లి కమిషనర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే తుమార్ చెరువు రెండేండ్లుగా ఆక్రమణకు గురవుతున్నది. ఈ చెరువును కాపాడటంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే చెరువు సగం వరకు మట్టిపూడ్చి కబ్జా చేయగా, చెరువు కిందిభాగంలో అలుగు పారే ప్రాంతాలను పూర్తిగా కాంక్రీట్‌తో గోడలను నిర్మించారు. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు స్పందించి శనివారం ఆక్రమణలను నేలమట్టం చేశారు.

